ప్రజాశక్తి
ఆదివారం 5 మే 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తప్పుడు కుల ధ్రువపత్రాలతో

నకిలీ గిరిజనులు పోటీ

- తోటపల్లి నిర్వాసితులకు న్యాయం చేసిన ఘనత సిపిఎందే
- ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/ కొమరాడ, గరుగుబిల్లి

అవినీతి పరులైన అరకు బిజెపి ఎంపి అభ్యర్థి కొత్తపల్లి గీత, కురుపాం వైసిపి అభ్యర్థి పుష్పశ్రీవాణి తప్పుడు ధ్రువపత్రాలతో ఎన్నికల్లో పోటీకి తలపడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వీరికి ఓటేస్తే సమస్యలు పరిష్కారం కాకపోగా, గిరిజనులు మరింత దోపిడీకి గురవుతారని తెలిపారు. హిందువుల ముసుగులో బిజెపి గిరిజనులను, దళితులను, పేదలను దోచుకుంటున్నదని విమర్శించారు. మళ్ళీ మోడీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు లో ఎన్నికలు జరిగే పరిస్థితి ఉండ బోదని తెలిపారు.

కొమరాడ మండలంలోని కొమరాడ, కూనేరు గ్రామాల్లోనూ, గరుగుబిల్లి మండలం నాగూరు, జియ్యమ్మవలస మండల కేంద్రాల్లోనూ శనివారం జరిగిన సిపిఎం ఎన్నికల ప్రచారసభల్లో శ్రీనివాసరావు పాల్గొన్నారు. పలు గ్రామాల్లోను, కూనేరు సంతలోను సిపిఎం నాయకులకు పూలమాలలు, హారతులతో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ బిజెపి, టిడిపి, వైసిపిలు ప్రజాస్వామ్యాన్ని లాభ సాటి వ్యాపారంగా మార్చేయని అన్నారు. వేతనాలు పెంచకుండా ధరలు, వివిధ రకాల పన్నులు పెంచేశారని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటంతో జాతీయ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కులచట్టం, ఆహార భద్రత చట్టాలను అప్పటి యుపిఎ -1 ఏర్పాటు చేస్తే వాటిని బిజెపి అధికారం లోకి వచ్చాక నిర్వీర్యం చేస్తోందని అన్నారు. నిలదీయాల్సిన టిడిపి, వైసిపిలు మోడీకి పల్లకి మోస్తున్నాయని విమర్శించారు. జగన్, చంద్రబాబు అవినీతి కేసుల్లో కురుకు పోయారని, వాటి నుంచి బయటపడేందుకు మోడీ వద్ద మోకరిల్లుతున్నారని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా ఈ ముగ్గురూ తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. వీరి పాలనలో ఉన్న ప్రశ్రమలు మూత పడ్డాయని, కొత్తగా ఉద్యోగాలు రాలేదని వివరించారు. ఇటువంటి మోసపూరిత విధానాలకు సిపిఎం పూర్తిగా వ్యతిరేకమని అన్నారు. ఆయా పార్టీల నాయకులు అవినీతి కేసులతో జైళకు వెళ్తే సిపిఎం నాయకులు ప్రజలకోసం పోరాడి అక్రమ కేసుల్లో జైలుకు వెళ్లారని అన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ఈ ప్రాంతం అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని, అనేక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. ముఖ్యంగా తోటపల్లి నిర్వాసితులకు న్యాయం చేసిన ఘనత సిపిఎం దేనన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి గతంలో సిపిఎం గెలిచి స్థానిక సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిందని అన్నారు. ఇండియా వేదిక మద్దతుతో పోటీ చేస్తున్న సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి అప్పలనర్సను, కురుపాం సిపిఎం అభ్యర్థి మండంగి రమణను గెలిపించాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్రానికి మోసం చేసిన బిజెపితో టిడిపి పొత్తుపెట్టుకోవడం, వైసిపి మద్దతివ్వడం సిగ్గు చేటన్నారు. మద్యపాన నిషేదం చేస్తామన్న జగన్ తిరిగి మరోసారి (మిగతా..3లో)

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

- మూడు రోజుల పాటు ఓటింగ్‌కు అవకాశం
- జిల్లాలో 18,631 మంది ఓటర్లు
- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 8వ తేది నుంచి పదో తేది వరకు అత్యవసర సేవల ఉద్యోగులకు..

సిద్ధం చేసిన పోస్టల్ బ్యాలెంట్ పోలింగ్ కౌంటర్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆదివారం నుంచి మూడు రోజులు పాటు అధికారులు అవకాశం కల్పించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఈ నెల 5 నుంచి 7వ తేదీ మధ్య ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం అన్ని నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆ మూడు రోజుల్లో ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఓటు వేయవచ్చు. జిల్లాలో పనిచేస్తూ, ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉండి, పోస్టల్ ఓటు కోసం ఫారం -12 ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు, తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి, విజయనగరంలోని జెఎన్‌టియు గురజాడ విశ్వ విద్యాలయంలో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అకడమిక్ బ్లాక్-1 , గ్రౌండ్ ఫ్లోర్ లోని 1,2,3,4,5 గదుల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం (మిగతా..3లో)

నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ సెంటర్లు

రాజాం	: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజాం
బొబ్బిలి	: శ్రీ వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాల, గొల్లపల్లి, బొబ్బిలి
చీపురుపల్లి	: శ్రీరాం జూనియర్ కాలేజ్, యస్.డి.యస్. కాలేజి ప్రాంగణం గరివిడి
గజపతినగరం	: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల.. గజపతినగరం
నెల్లిమర్ల	: సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మిమ్స్ ఆసుపత్రి పక్కన, నెల్లిమర్ల
విజయనగరం	: జెఎన్‌టియు. ఇంజినీరింగ్ కళాశాల
శృంగవరపుకోట	: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శృంగవరపుకోట

మూడో రోజూ

సాలూరు ఎపిజివిబికి చేరుకున్న పింఛనుదారులు

అవే బాధలు

పింఛన్ల కోసం లబ్ధిదారుల అవస్థలు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

పింఛను డబ్బుల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు మూడు రోజు కూడా అవే బాధలు ఎదురయ్యాయి. పింఛను కోసం శనివారం కూడా బ్యాంకుల వద్ద నిరీక్షణ తప్పలేదు.పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని సుదూర ప్రాంతమైన ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం కొఠియా నుండి సుమారు 45మంది ప్రమాదకరమైన ఘాట్ రోడ్డు నుంచి ప్రైవేట్ జీపుల మీద ఉదయం తొమ్మిది గంటలకే మండలంలోని మామిడిపల్లిలో విశాఖ (మిగతా..3లో)

ప్రచారానికి మరింత పదును

- ఎత్తులు.. పైఎత్తుల్లో నాయకులు
- గ్రామాల్లో ఉపాధి కూలీలే లక్ష్యం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు తమ ప్రచారానికి పదునుపెట్టారు. ఉదయం 8గంటల నుంచే ఇంటింటికీ ప్రచారం చేపడుతున్నారు. గ్రామాల్లో ఓటర్లంతా ఉపాధి పనుల్లో ఉండడంతో అభ్యర్థులు నేరుగా వారి వద్దకే వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎండ తీవ్రతతో 11గంటలకే నాయకులంతా ఇళ్లకు చేరుతున్నారు. ఎక్కువ మంది సాయంత్రం నుంచి ప్రచార సభలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. విజయనగరంతో పాటు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లు ప్రచారం చేస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో మాత్రం వైసిపి, టిడిపికి ధీటుగా సిపిఎం నాయకులు ప్రచారం చేపడుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి, టిడిపి అభ్యర్థులు ప్రచారంలో పాల్గొనేందుకు జనాలకు డబ్బు, మద్యం సరఫరా చేస్తున్నారు.ఎండల తీవ్రతతో కార్యకర్తలు సైతం ప్రచారంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపకపోవడంతో జనాలతో పాటు వారికి కూడా రూ.300 నుంచి రూ.500 వరకు ఇస్తున్నారు. అన్ని చోట్లా అభ్యర్థులు ఇంటింటికీ తిరగడంతో పాటు కరపత్రాలను పంచుతూ, మైకుల ద్వారా, సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధానంగా త్రిముఖ పోరు నెలకొంది. ఈ పోటీలో టిడిపి అభ్యర్థి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసిపి తరుపున ప్రస్తుత ఎమ్మెల్యే ,డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బరిలో ఉండగా ఇండియా కూటమి తరఫున సుంకరి సతీష్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పోటిలో ఉండి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకును కాపాడుకోవడంతో పాటు ఇండియా కూటమి మద్దతుతో సిపిఎం, సిపిఐ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు అధి నేతలు వచ్చి సభలు పెట్టి ఎన్నికల వేడిని మరింత పెంచారు. మరోవైపు ఎమ్మెల్యే కోలగట్లకు (మిగతా..3లో)

నెల్లిమర్ల : మాటాడుతున్న లోకం మాధవి

గ్రామాల్లో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. శనివారం ఆమె నెల్లిమర్ల నగర పంచాయతీ, గుషిణి, అలుగోలు, సతివాడ గ్రామాల్లో టిడిపి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5ఏళ్ల వైసిపి పాలనలో సహజ వనరులు దోచుకొని ఆ పార్టీ నాయకులు కోట్లకు పడగెత్తారని ప్రజా సమస్యలు అసలు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్రం పునర్నిర్మాణానికి, అభివృద్ధి జరగాలంటే అసెంబ్లీ అభ్యర్థిగా తనను గాజు గ్లాస్ గుర్తు, ఎంపి అభ్యర్థిగా కలిశెట్టి అప్పల నాయుడుకు సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పలనాయుడు, పోడుగు కృష్ణవేణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్, జనసేన నాయకులు బంగారు సరోజినీ, బంగారు శంకర రావు, బంగారు భాను ప్రకాష్, పాండ్రంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

టిడిపి ఎంపి అభ్యర్థి శ్రీభరత్

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

టిడిపితోనే గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ ఎంపి అభ్యర్థి శ్రీభరత్ అన్నారు. శనివారం ఎస్‌కోట మండలంలోని బొడ్డవర వద్ద ఓ కళ్యాణ మండపంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలోనూ, వేపాడ మండలంలోని బాణాదిలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలోనూ శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ మాట్లాడారు. టిడిపిలో చేరిన సుధారాణి, ఆమె గ్రూపుపై ఎమ్మెల్యే లేని పోని ఆరోపణలు చేసే ముందు ఆయన గిరిజన గ్రామాలకు ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. నాయకుల మధ్య గొడవలు పెట్టి ఎమ్మెల్యే పబ్బం గడుపుకోవడానికి చూస్తున్నట్లు చెప్పారు. చిట్టెం పాడులో సంఘటన జరిగినప్పుడు ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ప్రజా సేవ చేసేందుకు గెలిపించండి: బేబినాయన

బొబ్బిలి: ప్రజా సేవ చేసేందుకు తనను గెలిపించాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కోరారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సేవ చేసేందుకు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచా రంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నాయకులు జి.అప్పల స్వామి, బాబు పాలూరి, బిజెపి నాయకులు రామారావునాయుడు పాల్గొన్నారు.

ఎస్‌కోట: సమావేశంలో మాట్లాడుతున శ్రీభరత్

బొబ్బిలి: అవ్వతో మాట్లాడుతున్న బేబినాయన

బాడంగి : మండలంలోని పూడివలస, పాల్తేరు గ్రామాల్లో శనివారం బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమాన్ని బిసి సాధికార సమితి జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పూడివలస సర్పంచ్ రెడ్డి తిరుపతినాయుడు, పూడి రామకృష్ణ, టిడిపి నాయకులు పి.సత్తిబాబు, ఉడుముల సూర్యనారాయణ, కొల్లి అప్పలనాయుడు, వెన్నెల గణేష్, కొల్లి సత్యారావు, మరిపి బంగారునాయుడు పాల్గొన్నారు. ఆకులకట్ట పంచాయతీలోని దత్తి వెంకంపేటలో జరిగిన బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దించాలి : కొండపల్లి శ్రీనివాస్

జామి: సిఎం జగన్మోహన్ రెడ్డిని గద్దెదించి, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని లొట్లపల్లి, అట్టాడలో టిడిపి మండల అధ్యక్షులు పోరిపిరెడ్డి స్వామి నాయుడు ఆధ్వర్యంలో పర్యటించారు. లొట్లపల్లిలో మాజీ ఎంపిటిసి కడియాలా గోపి ఆధ్వర్యంలో 35 కుటుంబాలు టిడిపిలో చేరాయి. అట్టాడలో పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మినేని శ్రీను, కొత్తలి సూర్యారావు, నాయకులు, పాల్గొన్నారు.

రామభద్రపురం: టిడిపి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు మంచి గుర్తింపు నిచ్చిందని ఆర్య వైశ్యులంత రాబోయే ఎన్నికల్లో టిడిపికి మద్దతు ప్రకటించి చంద్రబాబును మరలా ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు అడ్డా గోవింద రాజు కోరారు. ఆరికతోటలో శనివారం ఆర్యవైశ్యుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో కూడా ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఎన్నో అంశాలు పొందుపరిచారని తెలిపారు. ఆ సంఘ నేతలు పుసర్ల బాబ్జీ, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

జామి: పార్టీలో కలిసిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్

అమలు సాధ్యం కాని హామీలను నమ్మొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల, భోగాపురం

అమలు సాధ్యం కాని హామీలను ఇస్తున్న కూటమిని నమ్మొద్దని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. శనివారం నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి డైట్ కాలనీ, భోగాపురం మండలంలోని ముంజేరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి చంద్రబాబు రాష్ట్రాన్ని మరో శ్రీలంక చేస్తారా అని విమర్శించారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి మోసపూరిత హామీలు నమ్మకుండా అమలు సాధ్యమైన హామీలిచ్చిన జగన్ మోహన్ రెడ్డికి, వైసిపికి పట్టం కట్టాలని కోరారు. ఈ ప్రచారంలో పూసపాటి రేగ ఎఎంసి ఛైర్‌పర్సన్ చిక్కాల అరుణ కుమారి, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, నాయకులు బైరెడ్డి నాగేశ్వర రావు, లీలావతి, కందుల రఘుబాబు, ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఉప్పాడ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని గొర్లిపేట, సీతారాముని పేట, కొత్త పేటలో ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్ బాబు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎమ్మెల్యే కుమారుడు ప్రదీప్‌నాయుడు, డెంకాడ సర్పంచ్ పతివాడ గౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి మద్దతివ్వండి : ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనకు ఓటుతో మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. మున్సిపాలిటీలోని పాత బొబ్బిలిలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి వైసిపిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి, ఆయన సోదరుడు వేణుగోపాల్, కుమారుడు శ్రీకాంత్, మాజీమంత్రి పెద్దింటి జగన్మోహన్‌రావు వేర్వేరుగా ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

బాడంగి: ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న శంబంగి శ్రీకాంత్

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

మండలంలోని ముత్తాయవలస గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

బాడంగి : వ్యక్తిగత స్వార్థంతో నాయకులు పెత్తందారుల వైపు వెళ్లినా.. సంక్షేమ పథకాలు పొందిన పేదలు మాత్రం సిఎం జగన్‌కు అండగా ఉన్నారని విజయనగరం జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పాల్తేరు గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి చిన్న అప్పలనాయుడును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కావాలా? మోసపూరిత హామీలు కావాలా?

మెరక ముడిదాం: గ్రామ స్థాయిలో ఉన్న ప్రతి ఒకరికి ప్రభుత్వ పథకాలు అందే పాలన కావాలా? ఎన్నికలు ముందు మోసపూరిత హామీలు ఇచ్చే నాయకుడు కావాలా? మీరే ఆలోచించుకోండని బొత్స సత్యనారాయణ తనయుడు డాక్టర్ బొత్స సందీప్ అన్నారు. మండలంలోని భగీ రథపురం, జి.మర్రివలస, గోపన్నవలస, సోమలింగాపురం పంచాయతీలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. బొత్స సత్యనారాయణ మీ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని మరసారి ఆయన్ను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఎస్‌వి రమణ రాజు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్, క్రిష్ణ మూర్తిరాజు, సీతారామరాజు, తల చుట్ల హరిబాబు, బాలి బంగారు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలంటే వైసిపితోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండంలోని రామలింగాపురంలో గల చెరువుల వద్ద పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలతో వారు మాట్లాడారు. నిరంతరం ప్రజలకోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో మమేకమై ఉంటున్న మంత్రి బొత్స సత్యనారాయణను, ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం సొసైటీ మాజీ అధ్యక్షులు బెల్లాన త్రినాథరావు, ఇప్పిలి రాము, బెల్లాన రమణ, బెల్లాన లక్ష్మణ, గొర్లె రాఘవ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి: ఎమ్మెల్యే కడుబండి

వేపాడ : వచ్చే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలోని వీలుపర్తి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంతవరకు ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఆ విషయాన్ని గుర్తుంచుకొని మరోసారి వైసిపికి ఓటేయాలని కోరారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డిసిసిబి చైర్మన్ వివి చినరాము నాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, ఎంపిపి సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు, మాజీ సర్పంచ్ గోకాడ సత్యంనాయుడు, నాయకులు పాల్గొన్నారు

వేపాడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శతశాతం ఓటింగే లక్ష్యం

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో శత శాతం ఓటింగ్ సాధించాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ చెప్పారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని ప్రతి ఓటరు తమ ఓటు నిర్భయంగా వినియోగించు కోవాలని కోరారు. ఓటర్లకు మరింత వెసులుబాటు కల్పించడంలో భాగంగా ఈ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని గంటపాటు పెంచడం జరిగిందని చెప్పారు. ఓటర్ల చైతన్య కార్యక్రమం స్వీప్ లో భాగంగా నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు

ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రైనీ సహాయ కలెక్టర్ త్రివినాగ్, అధికారులు

శనివారం నిర్వహించిన రెండు కిలోమీటర్ల పరుగును ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ స్టేడియం వద్ద ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 85 ఏళ్ల వయసు నిండిన వద్ధులు, వికలాంగులు ఇంటి వద్దే తమ ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, మే 7 నుంచి 10వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు ఓటు వేయడంపై దృష్టి సారించామన్నారు. జిల్లాలో ప్రతి ఓటరు తమ ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా యంత్రాంగం చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ సందర్భంగా పరుగులో పాల్గొన్న వారితో ట్రైనీ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ అవే బాధలు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంక్‌ల వద్ద వచ్చి నిరీక్షించారు. ఇక్కడికి వచ్చిన చాలా మంది ఉదయం ఏమీ తినకుండానే వచ్చి వాళ్ల గ్రామాల నుంచి తెచ్చుకున్న అంబలి తాగి సేద తీరారు. 10.30గంటలకు తీరా బ్యాంకు తెరిచే సమయానికి అధికారులు ఖాతా లేదని, నిలిచిపోయిందంటూ చెప్పడంతో గిరిజనులు నిరాశతో తిరుగుముఖం పట్టారు. పింఛను రాకపోగా, రానూపోనూ ఛార్జీలకు రూ.200 వరకూ ఖర్చయిందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ ఉద్యోగుల ద్వారా కనీసం తమ గ్రామాలకైనా వచ్చి పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

పాలకొండ : నగర పంచాయతీలో పింఛన్ల కోసం గత మూడు రోజులుగా వృద్ధులు పింఛన్ల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకుల వద్ద, నగర చెల్లింపు కేంద్రాల వల్ల పింఛన్ల కోసం లబ్ధిదారులు నిరీక్షించారు.

ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదు

నాకు 69 ఏళ్లు. పింఛను కోసం నేను ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదు. ఎప్పుడు మా గ్రామానికే వచ్చే పింఛను ఇచ్చేవారు. ఎన్నికల వల్ల ఇలా చేయడం దారుణం.

- తాడంగి కీను,
లబ్ధిదారుడు, కొరియా

మా ఊర్లోనే పింఛను ఇస్తే బాగున్ను

మాది గంజాయిభద్ర పంచాయతీ కోరియా గ్రామం. పింఛను కోసం మామిడిపల్లిలోని బ్యాంకు రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. తెల్లవారు జామునే అందరూ పింఛనుదారులమంతా ముందు రోజు మాట్లాడుకొని రానూ పోనూ జీపునకు ఒక్కో క్కరికి రెండు వందలు రూపాయలు ఛార్జీలు ఇచ్చి వచ్చాం. ఇక్కడ తినడానికి అదనంగా వంద రూపాయిలు వరకు ఖర్చవుతుంది. అందువల్ల మా గ్రామంలోనే పింఛను ఇస్తే బాగుండేది.

- గెమ్మెళ ఇందిర,
లబ్ధిదారుడు, కొరియా

బ్యాంకుకు రావడానికి రూ.300 అదనపు ఖర్చు

నాకు పిల్లలెవరూ లేరు. ప్రభుత్వం ఇచ్చే పింఛనుతోనే జీవనం సాగిస్తున్నాను. పింఛను కోసం ఇక్కడికి రావడంతో అదనంగా రూ.300 ఖర్చయింది. ప్రభుత్వం మాలాంటి ముసలి వాళ్లకు ఇంటి వద్దనే పింఛను ఇవ్వాలి.

- తాడంగి కోది,
లబ్ధిదారుడు, కొరియా

తప్పుడు కుల ధ్రువపత్రాలతో నకిలీ గిరిజనులు పోటీ

(మొదటిపేజీ తరువాయి)

అధికారం లోకి వచ్చేందుకు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని అన్నారు. బిజెపి, టిడిపి వైసిపి ప్రజా సమస్యలు, అభివృద్ధిపై మాట్లాడకుండా మాటల గారడీతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు పావులు కదుపుతున్నాయని అన్నారు. అందుకే సమస్యలపై చిత్త శుద్ధి తో పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలంటూ మోసంచేసిన మోడీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలకు సైతం ఎసరు పెట్టిందన్నారు. ఇప్పటికీ చాలా గిరిజన గ్రామాల్లో తాగు నీరులేక గెడ్డల్లో ఊట నీరు తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వంలో గిరిజనులు, దళితులు, మహిళలకు రక్షణ లేదన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపి, ఎంఎల్‌ఎ అభ్యర్థులు పి. అప్పలనర్స, మండంగి రమణ చాలా మంచివారు, నిజాయితీ పరులన్నారు. అనేక ప్రజా సమస్యలపై పనిచేసి ప్రజలకు అండగా నిలబడ్డారన్నారు. కురుపాం సిపిఎం ఎంఎల్ఎ అభ్యర్థి మండంగి రమణ మట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గిరిజన సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పు తానన్నారు. ప్రజలకు ఎర్రజెండా అండదండ గా నిలుస్తుందన్నారు. విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ చట్ట ప్రకారం గరిష్ఠంగా 10 ఎకరాలు పోడు భూమి అందేవిధంగా సిపిఎం పోరాడుతుందన్నారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సభలకు అధ్యక్షత వహించిన కొమరాడ, గరుగుబిల్లి సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, బివి రమణ మాట్లాడుతూ నియోజక వర్గం పరిధిలోని అనేక సమస్యలపై సిపిఎం చేసిన పోరాటాలు, విజయాలను వివరించారు. ఈ సందర్భంగా అర్ధంతరంగా నిలిచిపోయిన పూర్ణపాడు - లాబేసు వంతెనను నాయకులు పరిశీలించారు.

ప్రచారానికి మరింత పదును

(మొదటిపేజీ తరువాయి)

గట్టిపోటీ ఇస్తున్న టిడిపి అభ్యర్థి పూసపాటి అతిథి గజపతి విజయం కోసం వ్యూహ, ప్రతి వ్యూహాలతో కదులుతున్నారు. అంతే ధీటుగా వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సంఘాల నాయకులు, ద్వితీయ శ్రేణి పెద్దలతో ఆయన సమావేశాలు నిర్వహిస్తూ విజయానికి సహకరించాలని కోరుతున్నారు. సాయంత్రం వార్డుల్లో బహిరంగ సభలు ద్వారా మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారంలో దూకుడు పెంచారు. మెజారిటీ ఓటర్లను తన వైపు తిప్పుకునే విధంగా వ్యూహాలు రచిస్తున్నారు. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది.

ఓట్ల లెక్కలతో బిజీబిజీ

పోలింగ్ బూత్ ల వారీగా ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడతాయనే అంశంపై ప్రధానంగా అభ్యర్థులు ఇప్పటి నుంచే లెక్కలు వేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉన్న వారెవరు? ప్రతికూలంగా ఉన్న వారెవరు? ఇలాంటి వారిని తమవైపు ఎలా తిప్పుకోవాలని వ్యూహాలు రచిస్తున్నారు. అవసరమైతే వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను కలిసి ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు, వారి అనుచరులు నిమగ్నమయ్యారు. ప్రధానంగా అధికార పార్టీ నేతలు వాలంటీర్ల ద్వారా ఓటర్ల వివరాలను సేకరించి అనుకూల అంశాలపై చర్చిస్తున్నారు. అవసరమైతే ప్రలోభపెట్టి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

(మొదటిపేజీ తరువాయి)

విజయనగరం నియోజకవర్గంలో ఓటు కల్గిన ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవడానికి కూడా జెఎన్‌టియు లోని అకడమిక్ బ్లాక్ -2 లో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు.

అత్యవసర (ఎసెన్షియల్) శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు ఈ నెల 8 నుండి 10 వ తేదీ వరకు ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఓటు వేయవచ్చు. జిల్లాలో ఉంటూ ఇతర జిల్లాల్లో ఓటు కలిగిన వారి కోసం అకడమిక్ బ్లాక్-1 , గ్రౌండ్ ఫ్లోర్ లోని 1,2,3,4,5 గదుల్లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం విజయనగరం నియోజకవర్గంలో ఓటు కలిగిన ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవడానికి కూడా జెఎన్‌టియులోని అకడమిక్ బ్లాక్ -2 లో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు.

జిల్లాలో 18,631 పోస్టల్ బాలెట్లు

జిల్లాలో 18,631 మంది పోస్టల్ బాలెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బొబ్బిలి నియోజక వర్గంలో 2105 మంది , చీపురుపల్లిలో 1405 మంది, గజపతినగరంలో 1665 మంది, నెల్లిమర్లలో 1525 మంది , విజయనగరంలో 3975 మంది , శృంగవరపుకోట (అసెంబ్లీ)లో 1776, రాజాంలో 1741 మంది పోస్టల్ బాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పిఒలు, ఎపిఒలు, మైక్రో అబ్జర్వర్లు , పోలీసు, ఆర్‌టిసి ఉద్యోగులు, ఇతర జిల్లాల్లో ఓట్లు ఉన్న వారు , ఎసెన్షియల్ సర్వీసు లో ఉన్నవారు, కూడా ఉన్నారు. ఇందులో హోం ఓటింగ్ కోసం ఆప్ట్ చేసుకున్న వారు 242 మంది ఉన్నారు. పోస్టల్ ఓటు విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నవారు, కలెక్టరేట్లోని హెల్ప్ డెస్క్ 1950 ను సంప్రదించాలని సూచించారు.

ఇట్లమామిడిపల్లిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి-రామభద్రపురం

రాబోయే ఎన్నికల్లో ప్రజలకు వచ్చే అపోహలు తొలగించేందుకే పోలీసు కవాతు నిర్వహిస్తున్నామని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు తెలిపారు.శనివారం వివిధ పోలీసు దళాలతో స్థానిక ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో ఇట్లా మామిడిపల్లి లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామ పెద్దలు, ప్రజలు సహకరించాలని కోరారు.

నమ్మకం ఉంటేనే ఓటేయండి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రజలకు తమ హయాంలో సంక్షేమం అభివృద్ధి జరిగిందని నమ్మకం ఉన్నట్లయితేనే తమకు ఓట్లు వేయండి అని ధైర్యంగా అడుగుతున్నామని డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి, పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శనివారం నగరంలోని 45, 46, 44, 41, 40 డివిజన్లలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలలో వారు మాట్లాడారు. వీరభద్రస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పాలన సాగిందన్నారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన నాటి నుండి ప్రజలకు పూర్తి అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలలో పాలు పంచుకున్నామన్నారు. నగరభివృద్ధికి ఎంతగానో కృషి చేసానని, దాని ఫలితంగానే ప్రస్తుతం నగరం అంతా సుందరంగా దర్శనమిస్తోందని అన్నారు. మరో 30 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని మరొక్కసారి అవకాశాన్ని ఇస్తే ఆ పనులను కూడా పూర్తి చేసి సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే వచ్చే నాయకులకు ప్రజల కష్టసుఖాలు తెలియవని అన్నారు. కానీ తాము అనునిత్యం ప్రజలకు ఎల్లవేళలా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటామని అన్నారు. కార్యక్రమాల్లో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, జోనల్ ఇన్చార్జులు కొసర నారాయణ, తమ్ము, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు శైలడ ఈశ్వరమ్మ, తాళ్లపూడి సంతోషి కుమారి, బోనెల ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-బాడంగి

అప్పుల బాధతో యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని డొంకినవలస రైల్వేబ్రిడ్జి వద్ద శనివారం చోటుచేసుకుంది. ఆర్‌పిఎఫ్ సిబ్బంది కథనం ప్రకారం... మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన బోను వెంకటరమణ (20) ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఇంటిదగ్గర ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌కి అలవాటు పడి స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. దీంతో అప్పుల బాధతో శనివారం ఉదయం డొంకినవలస రైల్వే బ్రిడ్జి వద్ద పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహాన్ని బాడంగి సిహెచ్‌సికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. వెంకటరమణ తండ్రి అనారోగ్యంతో ఇదివరకే మరణించాడు. సోదరుడు, సోదరి, తల్లి ఉన్నారు. తల్లి రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు.

శ్లాబ్ పెచ్చులు పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని వెలగవాడలో ఇంటి శ్లాబ్ పెచ్చులూడి ఊహ రాణి అనే మూడు నెలల చిన్నారి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని వెలగావాడ చెందిన సంజీవ్, మంజుల కుటుంబం శుక్రవారం రాత్రి ఒక్కపోత భరించలేక తమ ఇంటి గడపలో నిద్రిస్తుండగా తెల్లవారుజామున శ్లాబ్ పెచ్చులు ఊడి నిద్రిస్తున్న వారి మీద పడ్డాయి. ఈ ప్రమాదంలో ఊహ రాణి తల మీద పెచ్చులు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నారి అమ్మ, అమ్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. సంజీవ్, మంజుల దంపతులకు మూడు నెలల క్రితమే ఊహారాణి జన్మించింది. పుట్టిన మూడు నెలలకే పాప విగతజీవైపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు తీవ్రంగా విలపించారు.

అక్రమ మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- చీపురుపల్లి

అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని చీపురుపల్లి పోలీసులు పట్టుకున్నారు. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి చీపురుపల్లి ఎస్ఐ కె కిరణ్ కుమార్ నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి సిగడాం మండలం బాతువ గ్రామం నుంచి చీపురుపల్లి మండలం కర్లాం గ్రామానికి బైక్‌పై మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ క్రమంలో మద్యం తరలిస్తున్న పైడిరాజుని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 106 మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
ఆదివారం
5 మే 2024

పాలకొండలో రసవత్తరం



- హ్యాట్రిక్ కొట్టేందుకు వైసిపి తహతహ
- సానుభూతిపైనే జనసేన ఆధారం
- తప్పని త్రిముఖ పోటీ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపితో పాటు కాంగ్రెస్ కూడా చాప కింద నీరులా దూసుకుపోతుంది. 2014, 2019 ఎన్నికల్లో వైసిపి పాలకొండలో విజయం సాధించింది. 2014లో 1600 ఓట్లతో, 2019లో 18వేల ఓట్ల మెజార్టీతో ప్రస్తుత ఎమ్మెల్యే కళావతి విజయం సాధించారు. ఈసారి కూడా ఎలాగైనా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. ప్రధానంగా సీతంపేట మండలం పైనే దృష్టి సాంచారని సమాచారం. జగన్మోహన్ రెడ్డి పథకాలే తనను గెలిపిస్తాయని కళావతి విశ్వసిస్తున్నారు. అదేవిధంగా ఆమెకు కూడా నియోజకవర్గంలో అన్ని మండలాల్లోని ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పవచ్చు. వైసిపి గెలుపునకు బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతగా ఉన్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చాపకింద నీరులా అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు. ఇది కూడా ఆమెకు గెలుపునకు ఎంతో దోహద పడుతుందని కార్యకర్తలు భావిస్తున్నారు. పాలకొండ, వీరఘట్టం గ్రామీణ ప్రాంతాల్లో టిడిపిలో ఉన్న గ్రూపులు వైసిపి కలిసొచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. అయితే పాలకొండ పట్టణంలో నగర పంచాయతీ వైసిపి చేతిలో ఉన్నప్పటికీ కొద్ది రోజుల నుంచి అక్కడ వైసిపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. విక్రాంత్ ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకు తర్జనభర్జనపడుతున్నట్టు తెలుస్తోంది. వీరఘట్టం మండలంలో పనసన నందివాడ గ్రామమంతా ఇటీవల జనసేనలో చేరడంతో ఈ మండలంలో పట్టున్న నేతగా గుర్తింపు పొందిన విక్రాంత్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇక సీతంపేట మండలం వైసిపికి అనుకూలంగా ఉన్నప్పటికీ భామిని మండలంలో ఆ పార్టీ కొంత వ్యతిరేక ఉంది. దీన్ని అధిగమించేందుకు నాయకులు నానా కుస్తీలు పడుతున్నారు. ఎమ్మెల్యే ఈ ఐదేళ్ల కాలంలో ఓటర్లతో మమేకమైనప్పటికీ ఆమె వ్యవహార శైలిపై సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన జంపరకోట జలాశయం, తోటపల్లి ఎడమ కాలువ పనులతో పాటు వీరఘట్టంలో ప్రధాన రహదారి పనులు పూర్తి కాకపోవడం వైసిపికి ప్రతికూలతలుగా ఉన్నాయి. అలాగే వైసిపి హయాంలో పదేళ్లలో పాలకొండ పట్టణం ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదు. పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు శిలాఫకం వేసి నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ ఆ పనులు పూర్తి కాకపోవడంతో ఇక్కడి ప్రజలు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ఈసారి కూటమి తరపున పోటీలో ఉన్న జయకృష్ణకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయని ప్రజల్లో చర్చ ఉంది. రెండుసార్లు ఓటమి చెందిన జయకృష్ణ మీద సానుభూతి కూడా ఎక్కువగా ఉందని, అది తమకు అనుకూలంగా మారుతోందని ఆయన వర్గీయులు చెప్తున్నారు. జనసేన తరపున పోటీలో ఉండడంతో యువతలో కూడా ఈయన పేరు మార్మోగిపోతోంది. నియోజకవర్గంలో మొత్తం లక్షా 94,220 మంది ఓటర్లు ఉన్నారు. అయితే కొత్తగా 12వేల చేరగా, అందులో 8వేల మంది యువతే ఉన్నారు. ఆ ఓటర్లు తమకే అనుకూలంగా ఉన్నారని జనసేన ధీమాగా ఉన్నట్టు సమాచారం. అదే విధంగా టీడీపీలో కూడా ఈయన్ను ఎలాగైనా గెలిపించుకోవాలని చూస్తున్నారు. ఈ సారి జయకృష్ణ కూడా సీతంపేట, భామిని మండలాల్లో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన వర్గీయులు చెప్తున్నారు. వీరఘట్టం మండలంలో కూడా ఆయన ఎమ్మెల్యే స్వగ్రామమైన వండువలో పాగా వేసి ఓటర్లను లాక్కునట్లు ఇటు జనసేన, టీడీపీ వర్గీయులు బహిరంగంగానే చెప్తున్నాయి. జయకష్ణ స్వగ్రామమైన ఎం.రాజపురం కూడా ఆయనకే అనుకూలమని తెలుస్తోంది. ఇటీవల కాలంలో వీరఘట్టం మండల కేంద్రంతో పాటు పాలకొండ నగర పంచాయతీలో కూడా టిడిపి పుంజుకుంది. సీతంపేటలో కొంత ప్రతికూలత ఉన్నా భామినిలో కొంత వరకూ పార్టీ ముందంజలో ఉందని నాయకులు భావిస్తున్నారు. ఇందుకు నిదర్శం ఇటీవల కూటమి పార్టీలో చేరికలేనని కార్యకర్తలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కూటమిలో ఐక్యత, నాయకుల మధ్య సమన్వయం కొరవడిందని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. అరకు ఎంపి అభ్యర్థి కొత్తపల్లి గీతకు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ మధ్య పూర్తిస్థాయిలో సఖ్యత లేనట్టు తెలుస్తోంది. దీంతో ఆమె సొంతంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఒక బలమైన సామాజికవర్గానికి చెందిన నాయకులు అభ్యర్థి జయకృష్ణను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటి కూడా కలిసిరావడంలేదు. గురువారం జనసేన అధినేత పవన్‌కల్యాన్ ఎన్నికల ప్రచారం పాలకొండలో జరగ్గా, టిడిపి నియోజకవర్గ స్థాయి నాయకులెవరూ పాల్గొనలేదు. ఇంది కొంత వరకూ కూటమి అభ్యర్థి గెలుపునకు ఆటంకం కానుంది. మొన్నటి వరకూ జయకృష్ణకు వెన్నంటి ఉన్న పాలకొండ మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడునాయుడు కొద్ది రోజుల నుంచి ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇదిలా ఉండగా జనసేన పార్టీలోనూ గ్రూపు రాజకీయాలు అభ్యర్థికి తలనొప్పిగా మారింది. అభ్యర్థి జయకృష్ణ ఒకే నాయకుడికి ప్రాధాన్యత ఇవ్వడంతో మిగిలిన నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

మరోవైపు ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ తరపున పోటీలో ఉన్న చంటిబాబు కూడా సీతంపేట, భామిని మండలాల్లో తన ప్రచారం గట్టిగా చేస్తున్నారని సమాచారం. కాంగ్రెస్‌కు ఏజెన్సీలో సంప్రదాయ ఓటు బ్యాంకు గట్టిగానే ఉందని, అది ఈసారి తమకు అనుకూలంగా మారుతుందని విశ్వసిస్తున్నారు. అదే విధంగా సీతంపేట ఏజెన్సీలోని గిరిజన గ్రామలతో పాటు, కార్మిక సంఘాలలో బలంగా ఉన్న సీపీఎం కూడా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా గట్టిగానే పని చేస్తున్నట్లు చెప్తున్నారు. అయితే పాలకొండ శాసనసభ ఎన్నికల్లో గెలిచి పీఠం ఎక్కేదేవరో మే 13వ తేదీన ఓటర్లు ఇచ్చే తీర్పుతో తేలనుంది.

విశ్వసరాయి కళావతి
వైసిపి

నిమ్మక జయకృష్ణ
జనసేన

సవర చంటిబాబు
కాంగ్రెస్

ఎస్.కోటలో హోరాహోరీ

- పట్టుబిగిస్తున్న మంత్రి బొత్స
- టిడిపి, వైసిపి మధ్య గట్టి పోటీ
- విశాఖ ఎంపి గెలుపునకు 'కోట' కీలకం
- రసవత్తరంగా మారిన రాజకీయం

శృంగవరపుకోట రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ప్రదానంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యానారాయణ ఎస్‌కోటపై దృష్టి పెట్టారు. దీంతో కోట రాజకీయం వేడెక్కింది. ఎస్.కోట అసెంబ్లీ స్థానానికి 12 మంది అభ్యర్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. బిఎస్‌పి, సమాజ్‌వాద్ పార్టీ అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ, స్వతంత్ర అభ్యర్థులు మాదిరిగానే నామమాత్ర పోటీకి పరిమిత మవుతున్నారు. ఇలా 12 మంది పోటీదారులతో ఎస్.కోట ఎమ్మెల్యే ఎన్నిక జరగనుంది. కాగా ఇక్కడ నుంచి ఎంపి అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మి వైసిపి తరుపున బరిలో దిగడంతో ఈ నియోజకవర్గంపై బొత్స ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నియోజకవర్గంపై పట్టు సాధించాలని పావులు కదుపుతున్నారు. దీంతో ఎస్‌కోటలో రాజకీయం వేడెక్కింది.

ప్రజాశక్తి - జామి

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి, ఎన్‌డిఎ కూటమిలో టిడిపి, జనసేన పార్టీలు అధికారం కోసం కొట్లాడుతున్న విషయం తెలిసిందే. కానీ ఎన్నడూ లేని విదంగా ఎస్. కోట అసెంబ్లీ బరిలో తొలి సారీ బొత్స మార్కు రాజకీయం చూపిస్తున్నారు. విశాఖ పార్లమెంటు స్థానానికి బొత్స ఝాన్సీ పోటీ చేయడంతో ఎస్.కోట వైసిపి శ్రేణులు పరుగులు పెడుతున్నాయి. టిడిపిని ఓడించి మరోసారి అధికార పీఠం ఎక్కాలని బావిస్తున్న వైసిపి, కడుబండి శ్రీనివాసరావును అత్యధిక మెజారిటీతో గెలిపించి, తద్వారా ఝాన్సీ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకోవాలని చూస్తోంది. అందుకు బొత్స రాజకీయ చతురత వాడుకోవాలని వైసిపి బావిస్తోంది. అందులో భాగంగానే వార్డు స్థాయి మొదలు కొని నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ బొత్స నేరుగా మాట్లాడి, రంగంలోకి దింపిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి నియోజకవర్గంలో కొప్పలవెలమ సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉండడంతో వారి మధ్య చీలిక జరిగి, ఆ తర్వాత స్థానంలోని కాపు సామాజిక వర్గం ఓటర్లు పార్టీలు వారీగా విడిపోయేవారు. కానీ ఈ సారీ బొత్స ఝాన్సీ పోటీతో కాపు సామాజిక వర్గం ఓట్లు వైసిపికి గుంప గుత్తుగా మారే అవకాశం లేకపోలేదని వైసిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే వైసిపి ప్రభుత్వ వ్యతిరేక ఓటును పదిలం చేసుకునే అవకాశం ఉందని వైసిపి వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు దశబ్ద కాలంగా బొత్స ఎస్. కోట నాయకత్వానికి అండగా దిశ నిర్దేశం చేస్తున్నప్పటికీ ఏనాడు బొత్సకు గాని, కుటుంబ సభ్యులకు గానీ నేరుగా ఓటు వేసే అవకాశం నియోజకవర్గం ప్రజలకు, ఆపార్టీ వర్గాలకు రాలేదు. కానీ తొలిసారి ఝాన్సీ పోటీతో వారికి బొత్సకు ఓటు వేసే అవకాశం లభింస్తుందని కేడర్ బావిస్తోంది. ఈ నేపథ్యంలోనే విబేధాలను పక్కను పెట్టి పనిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిస్తోంది. దీంతో వైసిపి టిడిపికి రసవత్తర పోటీ ఇస్తుందన్న చర్చ సాగుతోంది. మరోవైపు ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు భార్య సుధారాజు టిడిపిలోకి వెళ్ళినప్పటికీ కొద్ది పాటి నాయకులు మినహా ఎవరూ పార్టీ విడలేదు. మరోవైపు ఏళ్లగా రాజు వ్యతిరేక గ్రూపుగా ఉన్నవారు వైసిపికి మారిన పరిస్థితి. మొత్తానికి రఘురాజు పార్టీని వీడిన నష్టాన్ని అటు బొత్స మార్కు రాజకీయంతో సరిచేసుకున్నట్లు వైసిపి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే విశాఖ పార్లమెంటును గత ఎన్నికల్లో వైసిపి కైవసం చేసుకున్నప్పటికీ మారిన రాజకీయ పరిస్థితుల్లో ఈ సారి టిడిపి, వైసిపి మధ్య గట్టి పోటీ నెలకొంది. గతంలో ఈ రెండు పార్టీల మధ్య కేవలం 4వేలు ఓట్లు మాత్రమే తేడా ఉండటంతో ఈ సారి తాము గెలిస్తామంటే తాము గెలిస్తామని రెండు పార్టీల నాయకులూ ధీమావ్యక్తం చేస్తున్నారు.

ఇక టిడిపి విషయానికొస్తే, ఎస్‌కోట తెలుగుదేశానికి కంచుకోట అని చెప్పాలి. దీనికి తోడు ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో ఈ సారీ గెలుపుతధ్యమని తెలుగు తమ్ముళ్లు బావిస్తున్నారు. కానీ గొంప కృష్ణ రాకతో నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల రెండు గ్రూపులుగా చీలిపోయారు. కృష్ణకు టిక్కెట్ రాలేదని రెబల్ అభ్యర్థిగా పోటీకి సిద్దమై చివరి నిమిషంలో అధిష్టానం కోరిక మేరకు కోళ్ల లలితకుమారితో కలిసి పని చేసేందుకు అంగీకరించాడు. కాని కేడర్ ఎంత వరకూ ఎన్నికల్లో కలిసి ముందుకు వెళతారో అన్నది నేటికీ స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలోనే టిడిపి ఎన్నికల సమరంలో కేడర్ అయోమయంలో ఉందన్న వాదన లేకపోలేదు. జగన్ ప్రభుత్వాన్ని దించేయ్యాలన్న వేవ్ పని చేస్తే తప్పా టిడిపి ఏమేరకు వైసిపి రాజకీయాన్ని తట్టుకుని అధికారాన్ని ఛేజిక్కించుకుంటుం దోనన్నది వేచి చూడాలి.

మరోవైపు ఇండియా కూటమి అభ్యర్థి డాక్టర్ తిరుపతి నియోజకవర్గం ప్రజలకు సుపరిచితుడు. ఆయన కూడా వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కాంగ్రెస్ కు ఓట్లు పడే అవకాసం ఉంది. దీని వల్ల టిడిపి, వైసిపి ఓట్లుకు కొంత నష్టం కలుగుతోందని అంచనా. స్వతంత్ర అభ్యర్థులకు ఏ మాత్రం ఓట్లు పడినా, అవి కూడా గెలుపు, ఓటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఇలా మొత్తానికి ఈసారీ కోట రాజకీయం రసవత్తరంగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు.

కడుబండి శ్రీనివాసరావు
వైసిపి

కోళ్ల లలితకుమారి
టిడిపి

గేదెల తిరుపతి
కాంగ్రెస్



ఏజెన్సీలో ఎర్రజెండా రెపరెపలు

కొమరాడలో సిపిఎం అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు

నాగూరు సభలో మాట్లాడుతున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ

నాగూరు సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ

అర్థాంతరంగా నిలిచిన పూర్ణపాడు-లాబేసు వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సుబ్బరావమ్మ

అభ్యర్థుల చూపంతా సీతంపేట వైపే

ప్రజాశక్తి - సీతంపేట

సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు ఓటర్ల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించింది. పాలకొండ నియోజకవర్గం అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండడంతో మహిళలు ఎటువైపు మొగ్గుచూపుతే అటువైపే అభ్యర్థులకు పదవులు వరిస్తాయి. పాలకొండ ఎస్‌టి నియోజకవర్గం పరిధిలో పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల్లో 1,95,020మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,00,036మంది మహిళా ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 94,969మంది, ట్రాన్స్‌జెండర్లు 15మంది ఉన్నారు. మహిళలే అత్యధిక ఓటర్లు కావడంతో వారు ఎవరివైపు మొగ్గుచూపుతే వారే విజేతని చెప్పొచ్చు. మండలాల వరీగా వస్తే సీతంపేట మండలంలో 45,195 మంది ఓటర్లు గానూ పురుషులు 21,394 మంది ఓటర్లు ఉండగా, స్త్రీలు 23788 మంది, ట్రాన్స్‌జెండర్లు 13మంది ఉన్నారు. భామిని మండలంలో 60,301 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 18656 మంది, స్త్రీలు 1937 ఓటర్లు ఉన్నారు. పాలకొండలో పురుషులు 29,633 మంది, స్త్రీలు 30,666 మంది ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఓటర్లు ఉన్నారు. వీరఘట్టంలో 51,521మంది ఓటర్లకు గానూ పురుషులు 25,286 మంది, స్త్రీలు 26,235మంది ఓటర్లు ఉన్నారు.

2019 సార్వత్రిక ఎన్నికల్లో 1,84967 ఓట్లకు గానూ 1,36, 712 ఓట్లు పోలయ్యాయి. వీటిలో వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే వి కళావతి 72,0 54 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు 54,074 ఓట్లు పడ్డాయి. అలాగే 2014 జరిగిన ఎన్నికల్లో 1,68,256 ఓట్లు గానూ 1,21,428 ఓట్లు పోలవ్వగా, వైసిపి అభ్యర్థి వి.కళావతికి 55,371 ఓట్లు పడగా, టిడిపి అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు 53,717 ఓట్లు పడ్డాయి. అయితే ఈ రెండు పర్యాయాలు సీతంపేట ఓటర్లు ఎటువైపు తీర్పు చెబితే ఆ అభ్యర్థులే గెలుస్తున్నారు. దీంతో అభ్యర్థులు సీతంపేట ఓటర్లపై ఎక్కువగా దృష్టిసారిస్తున్నారు. ఇప్పటికే బరిలో ఉన్న ఏడుగురు అభ్యర్థులు సీతంపేటలో ముమ్మరంగా ప్రచారం చేపట్టి ఓటర్లను తన వైపు తిప్పుకునేలా ప్రయత్నం చేస్తున్నారు.

మహిళా ఓటర్లే అధికం

ఎన్నికలు అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది ఓట్లు. ఐదేళ్లు పాలించే నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటు హక్కు తప్పనిసరి. ఎన్నికలు వచ్చాయంటే చాలు ఓటర్ల జాబితాలో తమపేరు ఉందో లేదో అని అందరూ ఓసారి సరిచూసుకుంటారు. అయితే ఓటుహక్కు కలిగి ఉండి, వేలికి సిరా గుర్తు వేసుకుని పోలింగ్ బూత్ నుంచి తిరిగి బయటకు వచ్చేటప్పుడు ఓటరు మొహంలో ఎనలేని ఆనందం కనిపిస్తుంది. అదే కొత్త ఓటరైతే ఆ ఆనందం రెట్టింపు అవుతుంది. అయితే ఓట్లలో పలు రకాలు ఉంటాయని చాలామందికి తెలియదు. ఓట్లలో వివిధ రకాలు ఉంటాయి. వివిధ హోదాల్లో వీటిని వినియోగించుకోవచ్చు. ఒకసారి వాటిని పరిశీలిస్తే..

- ప్రజాశక్తి,విజయనగరంకోట

ఓట్లు.. పలు రకాలు

సాధారణ ఓటు...

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించింది. ఇలా ఓటు హక్కును పొందినవారు తమకు నచ్చిన నేతకు ఓటు వేసుకునే అవకాశం ఉంది. బూత్‌లోకి వెళ్లి మామూలుగా ఓటు వేస్తే దాన్ని సాధారణ ఓటు అంటారు.

పోస్టల్ బ్యాలెట్

ఎన్నికలు సజావుగా కొనసాగాలంటే చాలామంది ఇందుకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఓటు వేసేందుకు గ్రామాలకు, పట్టణాలకు వెళ్లి ఓటుహక్కును వినియోగించు కోలేరు. ఇందుకు ఎన్నికల సంఘం ఉద్యోగులు, అధికారుల కోసం పోస్టల్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా నచ్చిన వారికి ఓటు వేసి ఎన్నికల అధికారులకు ముందుగానే పంపించవచ్చు.

సర్వీస్ ఓటు

దేశ రక్షణలో భాగంగా చాలామంది సైనికులు, పారామిలటరీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోలేరు. తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం వీరికి వెసులుబాటు కల్పించింది. వీరిని సర్వీసు ఓటర్లుగా గుర్తించి.. వారి కోసం ప్రత్యేకంగా సర్వీసు ఓటును కల్పించింది. వీరు సర్వీస్‌లో ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయవచ్చు.

ప్రాక్సీ ఓటింగ్..

కేంద్ర నిఘా సంస్థలు, గూఢచారి సంస్థల సిబ్బంది తమ ఉనికిని మరెవరికి తెలియనీయకుండా గోప్యంగా ఉంటారు. వారు తన ప్రతినిధిగా మరెవరినైనా పంపించి ఓటు వేయవచ్చు. ఈ విధమైన ఓటు హక్కునే ప్రాక్సీ ఓటు హక్కు అంటారు. వారు స్థానికంగా లేనందున ఓటు వేసేందుకు ఒక ప్రతినిధిని అధికారులు అనుమతిస్తారు. వీరిని క్లాసిఫైడ్ సర్వీసు ఓటరుగా గుర్తిస్తారు. నియోజకవర్గం, పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాక్సీఓటరు వివరాలపై ప్రిసైడింగ్ అధికారికి ముందే సమాచారం అందుతుంది. సర్వీసు ఓటరు తరపున వచ్చే ప్రాక్సీ ఓటరు ఆ పోలింగ్ బూత్ పరిధిలోని మిగతా ఓటర్ల మాదిరిగానే ఓటు వేస్తారు. అయితే సాధారణ ఓటరుకు కుడి చేతికి సిరాచుక్క పెడితే.. ప్రాక్సీ ఓటరుకు మధ్య వేలికి చుక్క పెడతారు. ఏమంటే.. ఆయన తన సొంత ఓటు వేసినప్పుడు చూపుడు వేలికి సిరాచుక్క పెట్టాల్సి ఉంటుంది. కాగా, ప్రాక్సీ ఓటరు తన ఓటు కాక ఒకరికి మాత్రమే ప్రాక్సీగా ఓటు వేయడానికి అవకాశం ఉంటుంది.

టెండర్ ఓటు

ఓటరు ఓటు వేయడానికి వచ్చేసరికి అతడి ఓటు ఇంకెవరో వేసిన సందర్భాలు ఉంటాయి. అయితే సదరు ఓటరు వివరాలను ప్రిసైడింగ్ అధికారి పరిశీలించి.. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే.. ఇవిఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపరు ద్వారా ఓటుకు అవకాశం కల్పిస్తారు. దీనినే టెండర్ ఓటు అంటారు. ప్రతి పోలింగ్ బూత్‌కు పార్లమెంట్, శాసనసభకు సంబంధించి 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఓటు వేశాక కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తే.. దాని వెనుక టెండర్ బ్యాలెట్ అని రాస్తారు.

ఛాలెంజ్ ఓటు

ఓటు గుర్తింపు విషయంలో అధికారులకు సందేహం కలిగినా, ఏజెంట్లు అభ్యంతరం చెప్పినా సదరు ఓటరు తన గుర్తింపును చాలెంజ్ చేసి రుజువు చేసుకోవాలి. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఓటు వేయడానికి వచ్చినప్పుడు అతడి పేరు తప్పు చెబుతున్నాడని ఏజెంట్ అభ్యంతరం చెబితే ఓటరు, ఏజెంట్‌ను ప్రిసైడింగ్ అధికారి వద్దకు పంపుతారు. అభ్యంతరం చెప్పి ఏజెంట్ నుంచి రూ.2 చాలెంజ్ ఫీజు తీసుకుని ఓటరు వద్ద ఉన్న ఇతర గుర్తింపు వివరాలు అధికారులు పరిశీలిస్తారు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే స్థానిక బిఎల్‌డిని పిలిచి ఆరా తీస్తారు. ఓటరు జాబితాలో ఉన్న పేరు సరైందే అయితే.. వయసు, తండ్రి పేరు, చిరునామా లాంటి విషయాల్లో తేడా ఉన్నా పెద్దగా పట్టించుకోరు. అప్పుడు ఏజెంట్, ఓటరు ఇద్దరిలో ఎవరి వాదన సరైందని తేలితే వారిని వదిలి మిగతా వారికి ప్రిసైడింగ్ అధికారి మొదటిసారి హెచ్చరిక జారీ చేస్తారు. లేదా ఏజెంట్, ఓటరును అక్కడే పోలీసులకు అప్పగించొచ్చు. ఇక ఏజెంట్ చాలెంజ్ చేస్తే అతడిని బయటకు పంపించే అధికారం ప్రిసైడింగ్ అధికారికి ఉంటుంది.

పోలింగ్ స్టేషన్‌లోకి వీరికే ప్రవేశం

పోలింగ్ కేంద్రాల్లోకి కొంతమందికే ప్రవేశం కల్పిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, పోలింగ్ సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు, ఓటరుతో వచ్చే పసిబిడ్డ, సెక్టార్, ఆఫీసర్ మైక్రో అబ్జర్వర్, వెబ్ కాస్టింగ్, ఎలక్షన్ కమిషన్‌తో అనుమతించిన విలేకరులు, వీడియో గ్రాఫర్ మాత్రమే అనుమతి ఉంటుంది. పోలింగ్ ఆఫీసర్‌కు మినహా మిగతా ఎవరికీ పోలింగ్ కేంద్రంలోకి ఫోన్‌ను అనుమతించరు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేస్తామని ఆమె చెప్పారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ ఎఇ సురేష్‌ను ఆదేశించారు.

42 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం సచివాల యంలో 22, సింగరాయి గ్రామంలో 20 మంది గ్రామ వాలంటీర్లు శనివారం తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీనామా చేసి వైసిపికు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు.

16 మంది వాలంటీర్లు రాజీనామా

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామ సచివాలయ పరిధిలో 16 మంది వాలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ రాజీనామాలు సచివాలయ పంచాయతీ కార్యదర్శి హేమ సుందర్‌కు అందజేశారు.

జనసేనలోకి ఇద్దరు సర్పంచులు

భామిని : మండలంలోని మణిగ, దిమ్మిడి జోల, అనంతగిరి గ్రామాల్లో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో మణిగలో 36 కుటుంబాలు, దిమ్మిడి జోల 56, అనంతగిరి 25 మంది యువత జనసేనలోకి చేరారు. వీరిని జయకృష్ణ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మణిగ సర్పంచ్ కొండగొర్రి మంగ, దిమ్మిడి జోల సర్పంచ్ వలు రౌతుకూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరామన్నారు. కార్యక్ర మంలో టిడిపి మండలం అధ్యక్షులు బి.రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరరావు, నాయకులు బి.ప్రసాద్, సాకేటి రామారావు, సర్పంచ్ లోపింటి రాజేష్, కోరాడ రాజేష్,పొట్నూరు నాగేశ్వర రావు, బి.తులసి, బి.విష్ణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నిజాయితీగా రాజకీయాలు చేశాం'

ప్రజాశక్తి-గుర్ల

నిజాయతీగా రాజకీయాలు చేశామని టిడిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు అన్నారు. వల్లాపురం గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ వేతన దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రౌడీ రాజకీయం పెరిగిపోయిం దన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధి హామీ వేతన దారులకు మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. కిరణ్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఎవరు చనిపోయినా బీమా కింద ఆ కుటుంబాన్ని ఆదుకున్నామని తెలిపారు. చనామాల మహేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నాగులపల్లి నారాయణరావు, జిల్లా జనసేన నాయకులు రమేష్ రాజు, మండల సీనియర్ నాయకులు చిట్టిరాజు, అన్నెపు ఉమామహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని టెక్కలివలస, కాగాం, నెమలాం గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మరిపి విద్యాసాగర్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి, టిడిపి వైఫల్యాల వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి ముప్వల శ్రీనివాసరావు, తెర్లాం మండల అధ్యక్షులు పొందూరు రవీంద్ర, నాలుగు మండలాల అధ్యక్షులు పత్రి రాజు, రాంబార్కి రామకృష్ణ, రాజాన అప్పలనాయుడు, రాయి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ, కొత్తవలస : కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గేదెల తిరుపతి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కొత్తవలస మండలంలోని పాతసుంకరపాలెం, ఎర్రవానిపాలెం, బలిఘట్టం, వేపాడ మండలంలోని బక్కునాయుడుపేట, రాయుడుపేట గ్రామాల్లో

తెర్లాం: తనకు ఓటు వేయాలని కోరుతున్న విద్యాసాగర్

విజయనగరం: బ్రోచర్‌తో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెంటనే మేనిఫెస్టోలోని 9 అంశాలను తూచ తప్పక అమలు చేస్తామని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొత్తవలస మండల అధ్యక్షులు పాత్రుడు, నాయకులు పూడి శ్రీనివాసరావు, గోపి, అప్పారావు, సత్యారావు, బోని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గెలుపునకు సహకరించండి

విజయనగరం కోట: కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన గెలపునకు సహకరించాలని విజయనగరం పార్లమెంట్ ఇండియా వేదిక మద్దతు అభ్యర్థి బొబ్బిలి శ్రీను కోరారు . శనివారం విజయనగరం దాసన్నపేటలో ప్రచారం చేపట్టారు. పలు రంగాల కార్మికులను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మిక సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. ఆయన వెంట సిపిఐ నాయకులు పి.కామేశ్వరరావు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును ఈ నెల 5 నుంచి 7 వరకూ వినియోగించుకోవాలని ఆర్‌ఒ ఎం.నూకరాజు కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సికెఎం ప్రభుత్వ కళాశాల ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. నెల్లిమర్లలో పని చేస్తూ, నెల్లిమర్లలో ఓటు వున్న వారికి ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ వస్తే వారు స్థానిక ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకోవచ్చని తెలిపారు. నెల్లిమర్లలో పని చేస్తూ, ఇతర నియోజక వర్గంలో ఓటు ఉన్న వారు కూడా ఇక్కడ బ్యాలెట్ వినియోగించుకోవచ్చన్నారు. నెల్లిమర్లలో పని చేస్తూ, ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న వారు విజయనగరం జెఎన్‌టియులో ఓటు వేసుకోవచ్చన్నారు. సికెఎం ప్రభుత్వ కళాశాల ఫెసిలిటేషన్ సెంటర్‌లో సుమారుగా 1980 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటా రన్నారు. ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ వచ్చి, ఈ నెల 1వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం అప్లయ్ చేయని వారు వుంటే, వారు కూడా వారికి వచ్చిన ఎలక్షన్ ఆర్డర్ కాపీ, ఎన్నికల ఎపిక్ కార్డు తీసుకోని వారి ఓటు వున్న ఫెసిలిటేషన్ సెంటర్‌కి వెళ్లి ఓటు వేయవచ్చన్నారు.

రాజాంలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి- రాజాం

మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ బాలల సంరక్షణ, స్నేహ పూర్వక న్యాయ సేవల పథకంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదర భావం, దేశ భక్తి తదితర అంశాలపై వివరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ పాటించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో రాజాం

మాట్లాడుతున్న వివేక్ ఆనంద్ శ్రీనివాస్

జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణసాయి తేజ, న్యాయవాదులు ఆర్ విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, శ్రీ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ జి. పాపారావు, రాజాం టౌన్ పోలీసు సిబ్బంది, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం జరిగిన ఇవిఎంలు కమిషనింగ్, మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో నిర్లక్ష్యం వహించకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారి సాయిశ్రీని అడిగి తెలుసుకున్నారు.

రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ మంగరాజు

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : సిఐ

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చినమేరంగి సిఐ మంగరాజు కోరారు. శనివారం ఎస్సై చిన్నమనాయుడు ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ పోలీస్ బలగాలతో చినకుదమలో కవాతు నిర్వహించారు. ఎన్నికలనేవి ప్రతి ఐదేళ్లకు వస్తుంటాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో కుటుంబాల మధ్య తగాదాలు, విభేదాలు పెట్టుకోవడం సరికాదని ఆయన హెచ్చరించారు. అలాగే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. ఎన్నికలు నిర్వహించు అధికారులకు ఓటర్లంతా సహకరించాలని కోరారు.

తూకంలో తేడా వస్తే చర్యలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో శనివారం రేషన్ డిపో, ఎండియు వాహనాలను లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెదతాడివాడ ఎండియు ఆపరేటర్ కార్డుదారులకు ఇచ్చిన 15 కేజీల బియ్యాన్ని అందరి సమక్షంలో తిరిగి తూకం వేయగా 14 కేజీలు మాత్రమే వచ్చినట్లు గుర్తించి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ యం.దామోదర నాయుడు కేసు నమోదు చేశారు. గుణుపూర్‌పేట, చొల్లంగిపేట, పినతాడివాడ, డెంకాడ, బేతనాపల్లి, గుండాలపేట, బెల్లాం గ్రామాల్లో కూడా విస్తృతంగా తనిఖీలు చేపట్టి కిరాణా వ్యాపారాస్తులపై మరో 3 కేసులు నమోదు చేశారు. జిల్లాలో రేషన్ డీలర్లు, ఎండియు వాహన ఆపరేటర్స్, ఏ ఇతర

తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

వ్యాపారస్థులైనా తూకంలో తేడాలు చేయరాదని, ప్యాకేజీ వస్తువులు ముద్రించిన ధర కంటే అధికంగా వసూలు చేయరాదని హెచ్చరించారు. వినియోగదారులు ఎవరైనా మోసాలు గుర్తించిన వెంటనే తమ శాఖకు తెలియజేయాలన్నారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

ఎండల తీవ్రతపై అప్రమత్తం

ప్రజాశక్తి- సీతానగరం

ఎండతీవ్రతల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం బూర్జ గ్రామ పరిధిలో ఉపాధిహామీ వేతనదారులకు వేసవి దృష్ట్యా వడదెబ్బ, డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి అవగాహన కల్పించారు. బయట ఉష్ణోగ్రతలు కారణంగా శరీరం ఎక్కువ నీరు, లవణాలను కోల్పోతుందని, వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని, నీరు, నిమ్మరసం, మజ్జిగ, ఒఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు ఇంకా ఇంటి వద్ద అందుబాటులో ఉన్న ద్రావణాలు తరచుగా తీసుకోవాలన్నారు. పనుల నిమిత్తం ఉదయం ఇంటి దగ్గర బయల్దేరే ముందు తప్పని సరిగా ద్రవరూపంలో ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, తాగు నీరు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు వైద్య సిబ్బంది వద్ద గ్రామాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఒఆర్‌ఎస్ ప్యాకెట్‌ను

వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న డిఎంఒ జగన్మోహన్‌రావు

నీటిలో కలిపే విధానాన్ని అక్కడ వైద్య సిబ్బందిచే చేసి చూపించి, అక్కడ ప్రజలకు ఒఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ వడదెబ్బకు గురయ్యే సమయంలో తలనొప్పి, తలతిరగడం, వికారం, జ్వరం, స్పృహ కోల్పోవడం, అపస్మారక స్థితి మొదలగు లక్షణాలు ఉంటాయని వివరిస్తూ, ప్రాథమికంగా వెంటనే చేపట్టాల్సిన చర్యలను అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే దగ్గర్లో చల్లని నీడ ప్రదేశానికి తీసుకువెళ్లి, తడిగుడ్డతో శరీరాన్ని రుద్దుతూ ఉండాలని, స్పృహలో ఉన్నప్పుడే మాత్రమే నీరు తాగించలని అన్నారు. ఇంకా అపస్మారక స్థితిలో ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి, ఆసుపత్రికి తరలించాలన్నారు. పిల్లలకు తరచుగా నీరు తాగించాలని, ఎవరికైనా జ్వరం అనిపిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణీలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపాల్, వైద్య సిబ్బంది గాయిత్రి, నరసమ్మ, వెంకటేష్,ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

- నియోజకవర్గ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు
- సిపిఎం ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స

ప్రజాశక్తి - సాలూరు

ఇండియా వేదిక సిపిఎం ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స పట్టణంలో, మండలంలో శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు, ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు సిగడాపు బంగారయ్య, ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడుతో కలిసి ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనరస పట్టణంలో పలువురు ప్రముఖులు, ఓటర్లను కలిశారు. కాంగ్రెస్ నాయకులు విక్రం చంద్ర సన్యాసి రాజు, కూనిశెట్టి జెట్టిదొరను వారి నివాసాలకు వెళ్లి కలిశారు. కాంగ్రెస్, వామపక్షాలు, ఆమ్ ఆద్మీ పార్టీ లు బలపర్చిన అరుకు ఎంపీ అభ్యర్థి అప్పలనరసను గెలిపించాలని కోరారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు, క్రీడాకారులను కలిసి మద్దతు తెలపాలని కోరారు. మండలంలోని కురుకుట్టి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపి అభ్యర్థి అప్పలనర్స మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సాలూరు నుంచి అరకు వరకు మన్యం ప్రాంతాలను కలుపుతూ ఏర్పడిన పార్లమెంటు నియోజకవర్గం ఇప్పటికీ వెనుకబడి వుందన్నారు. ఇంతవరకు పనిచేసిన టిడిపి, వైసిపి ఎంపీలు ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేదని విమర్శించారు. సాలూరు మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి గతంలో అరుకు ఎంపీ గా పని చేసిన కొత్తపల్లి గీత కూడా సహకరించారని చెప్పారు. ఏజెన్సీలో సహజవనరుల దోపిడీ విషయంలో టిడిపి, వైసిపి, బిజెపి విధానాలు ఒక్కటేనన్నారు. పట్టణాల్లో ప్రజలపై చెత్త పన్ను విధించడం అన్యాయమన్నారు. తాను ఎంపీగా గెలిస్తే గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్లమెంటులో పోరాడుతానని చెప్పారు. సిపిఎం ఎంపి అభ్యర్థిగా తన గుర్తు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయాలని అప్పలనర్స కోరారు.

పాచిపెంట మండలం అమ్మవలసలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి అప్పలనర్స

పాచిపెంట : మండలంలోని పాచిపెంట, అమ్మవలస, కర్రివలస, గైరంపేట తదితర గ్రామాల్లో అరకు పార్లమెంట్ సిపిఎం ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనరస ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొత్తపల్లి గీత ఎంపిగా గెలిచి గిరిజన ప్రాంతంలో బాక్సైట్లను, గ్రీన్ గ్రానైట్లను అదానీకి అప్పజెప్పాలని చూస్తున్నారని, గెలిచిన తర్వాత ఆమె ముఖం కూడా అరకు నియోజకవర్గ ప్రజలకు చూపించలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు బ్యాలెట్ నెంబర్ -1 గుర్తు సుత్తి కొడవలి నక్షత్రంపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, మంచాల శ్రీనివాసరావు, ఎన్‌వై నాయుడు, బోను గౌరు నాయుడు, మర్రి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి: సిపిఎం, కాంగ్రెస్ నాయకులు గరుగుబిల్లిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, కాంగ్రెస్ నాయకులు, సుంకి సర్పంచి బివి రమణ, బి.శంకరరావు, కె.రవీంద్ర మాట్లాడుతూ కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి మండంగి రమణ, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పల నరస గుర్తులైన సుత్తి, కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో నాయకులు కె.రామారావు, డి.వెంకటనాయుడు, బాబురావు, కె.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని మామిడి మానుగోరా, కొండవాని గోర, పెద్దూరు, ఎస్ గోపాలపురం ,అచ్చెప్ప వలస, గంగంపేట, వంకాయల గడ్డ , జరడ కాలనీ తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు కె.మోహనరావు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇండియా వేదిక బలపర్చిన అరకు పార్లమెంటరీ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేయాలని, పాలకొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సవర చంటి బాబుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎం.సింహాచలం, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

మాక్ పోలింగ్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

సాలూరు శాసనసభ నియోజక వర్గంలో ఇవిఎం మాక్ పోలింగ్ ప్రక్రియను శనివారం చేపట్టారు. ఈ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి సి.విష్ణు చరణ్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు తనిఖీ చేశారు. ఇవిఎంల్లో గుర్తుల లోడింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు సింహాచలం, ఆనంద్‌కుమార్, ఎంపిడిఒ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు మూడు రోజులు అవకాశం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు మూడు రోజులు అవకాశం ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు తెలిపారు. ఈ మేరకు శనివారం డిఆర్‌ఒను కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు మొదట్లో 5వ తేదీ ఒక్కరోజేని ప్రచారం జరిగిందని, అది కొందరి ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇబ్బందిగా ఉండడంతో జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతి అందించగా ఆయన స్పందించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోస్టల్ బ్యాలట్‌ను మే 5,6,7 తేదీల్లో వేయవచ్చని డిఆర్‌ఒ తెలిపారన్నారు. కావున పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ, ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన వారు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో 5,6 తేదీల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం అప్పన్న పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని నౌగూడ సమీపాన గల పాలిటెక్నికల్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ప్లేయింగ్ స్క్వాడ్ మురళీకృష్ణ, గిరీష్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పాలిటెక్నికల్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నీరు, విద్యుత్, ప్రథమ చికిత్స బాక్సు అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. వీరితో పాటు చీఫ్ సూపరింటెంటెండెంట్ గంగస్వామి తదితరులు ఉన్నారు.

సంతకాలతో సరిపెట్టిన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుండగా, ఎన్నికల కావడంతో సభ్యులు సంతకాలతోనే సమావేశం ముగిసినట్టు ప్రకటించారు. అధ్యక్షత వహించాల్సిన ఎంపిపి ఎన్నికల ప్రచారంలో ఉండడం వల్ల కేవలం కోరం సభ్యులే హాజరయ్యారు

ఇలా ఉంటే బోరు వాడేదెలా?

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని 17వ వార్డులో గల బంగారమ్మ కాలనీలోకి వెళ్లే మార్గంలో ఉన్న ఒకటో వీధిలో ఉన్న బోరు నీరు వాడుక చేసేందుకు అవకాశం లేకుండా బోరు దగ్గరే మురుగునీరు నిలిచి నిల్వ ఉండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆ బోరు నీటిని వాడేందుకు స్థానిక మహిళలు ఆసక్తి చూపించకపోవడంతో బోరు వాడుక లేకుండా ఉంది. ఈ వార్డు పరిధిలో గల సచివాలయం శానిటరీ సెక్రటరీ గానీ, మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు గానీ పారిశుధ్య కార్మికులచే బోరు పరిసర ప్రాంతాన్ని శుభ్రపర్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బోరు వద్ద పేరుకుపోయిన మురుగునీరు

పాచిపెంట మండలం పనుకువలసలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

మోసపూరిత మేనిఫెస్టో నమ్మి మోసపోవద్దు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

చంద్రబాబు నాయుడు ప్రకటించిన మోసపూరిత మేనిఫెస్టో నమ్మి ప్రజలు మోసపోవద్దని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. రాష్ట్ర ప్రజలను మరో మారు మోసగించడానికి చంద్రబాబు చూస్తున్నారన్నారు. మండలంలోని పనుకువలస, పి.కోనవలస, మంచాడవలస, విశ్వనాథపురం, కర్రివలస పంచాయతీల్లో గల పలు గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాయగాళ్లు, మోసగాళ్లు మాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. మళ్లీ మీరంతా ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి టిడిపి నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, డోల బాబ్జీ, గొట్టాపు ముత్యాలునాయుడు, టి.గౌరీశ్వరరావు, సిహెచ్ సీతారామకృష్ణ, సిహెచ్ సావిత్రి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి, డిప్యూటీ సీఎం రాజన్నదొరను మరోసారి గెలిపించాలని కోరుతూ విశ్రాంత డిఇ ఎంవిఎన్ వెంకటరావు శనివారం ప్రచారం చేశారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ లో డిఇ గా నియోజకవర్గం లో ఎక్కువ కాలం పని చేసిన వెంకటరావుకు రాజన్నదొర అంటే వ్యక్తిగత అభిమానం వుండడంతో ఆయన గెలుపు కోసం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శనివారం తోణాం సంతలో వైసిపి నాయకులు, సర్పంచ్ మువ్వల ఆదియ్య, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు,ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ కొండ గొర్రి ఉదయ్ కుమార్‌తో కలిసి ప్రచారం చేశారు. మళ్లీ రాజన్నదొర గెలిస్తే నియోజకవర్గంలో గిరిజన గ్రామాలకు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. కార్యక్రమంలో జానపద గాయకుడు డప్పు శ్రీను రాజన్నదొర పై పాటలు పాడి అలరించారు.

ఎపి మోడల్ స్కూల్లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం మోడల్ స్కూల్లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్‌ఒ వివి రమణ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగియుండి ఫారం - 12 సమర్పించి ఎన్నకల విధులు నిర్వహించనున్న పిఒ, ఎపిఒ, ఒపిఒలు, ఇతర ఎన్నికల సిబ్బంది కొరకు తమ పోస్టల్ బ్యాలెట్‌ను మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఐదు ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద 5,6,7 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్యలో వారి ఓటరు కార్డ్ లేదా, ఇతర గుర్తింపు కార్డ్‌తో పాటు ఎన్నికల విధుల ఆర్డర్‌తో హాజరై వారి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవలని సూచించారు. అలాగే సెల్ ఫోన్లు పోలింగ్ కేంద్రం లోపలికి అనుమతించబడవని, ఈ అవకాశాన్ని ఎన్నికల విధిలో ఉన్న ఉద్యోగులు వినియోగించుకోవాలని అన్నారు.

ప్రయివేట్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రవేటు ఆసుపత్రులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె పట్టణంలో శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ, శ్రీ కోట దుర్గ, విఎంఎస్ హాస్పిటల్స్, పిఎంఆర్ డయాగ్నోస్టిక్ సెంటర్, లిఖిత స్కానింగ్ సెంటర్లను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు, ల్యాబ్, రోగులు వేచియుండే హాల్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పాటిస్తున్న తీరు, టాయిలెట్ల నిర్వహణ మొదలగునవి పరిశీలించారు. ఆసుపత్రుల్లో జరుగు కాన్పుల వివరాలు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్ ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. నోటిఫైడ్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర కేసులకు చికిత్సతో పాటు ఎల్ ఫారం నింపి వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి తెలియపర్చాలన్నారు. ఆరోగ్య సూచనలు, నిబంధనలు తెలియజేసే చార్టులను ఆసుపత్రుల్లో ప్రదర్శించాలన్నారు. ఈ పరిశీలనలో డిప్యూటీ డెమో వై. యోగీశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు, రేపు బృందాకరత్ పర్యటన

ప్రజాశక్తి-పార్వతీపురం

సిపి ఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ ఆదివారం, సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాలో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 4.30గంటలకు శ్రీకాకుళం నుంచి పాలకొండ చేరుకోనున్న ఆమె ఆర్‌టిసి కాంప్లెక్సు పోటీగేటు పక్క ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో పాల్గొంటారు. రాత్రికి పార్వతీపురం చేరుకొని బస చేస్తారు. సోమవారం ఉదయం 11గంటలకు గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం పార్వతీపురం చేరుకొని పట్టణంలో రోడ్డుషో, ప్రచార సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి రాత్రికి విజయనగరం చేరుకుంటారు. 7వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించనున్నారు.

ఎన్నికల విధుల్లో 12,522 మంది సిబ్బంది

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు 12,522మంది సిబ్బందిని అధికారులు నియమించారు. ఈనెల 13న పోలింగ్‌కు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటికే పిఒ, ఎపిఒ, ఒపిఒలను నియమించారు. వీరంతా . ఓటర్లను గుర్తించడం, చేతి చూపుడు వేలుపై సిరా మరక వేయడం, ఓటు ఎలా వేయాలో చెప్పడం వంటి వివిధ రకాల బాధ్యతలను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా పిఒ, ఎపిఒ, ఒపిఒలు మొత్తంగా 12,522 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో పిఒలు 2087 మంది, ఎపిఒలు 2087మంది, ఒపిఒలు 8348 మంది ఉన్నారు. వీరందరికీ ఇప్పటికే మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ఎవరు ఏ నియోజకవర్గంలో నియమితులయ్యారో ఇప్పటికే సిబ్బందికి ఆర్డర్లు జారీ చేశారు.

ఏ నియోజకవర్గంలో ఓటు ఉంటే అక్కడే పోస్టల్ బ్యాలెట్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఓటు కలిగి ఉండి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు వారి సొంత నియోజక వర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు వారి సొంత నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి ఈ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు మే 5,6 తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనేందుకు శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఓటు కోసం దరఖాస్తు సమర్పించిన అందరు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

హోం ఓటింగ్ కు 270 దరఖాస్తులు

జిల్లాలో 85 వయస్సు దాటిన ఓటర్లు 3900 మంది ఓటర్లు ఉండగా, 270 మంది హోమ్ ఓటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వికలాంగులు 12247 మంది ఓటర్లు ఉండగా, 383 మంది హోమ్ ఓటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. వీరి ఇంటి వద్దకే ఎన్నికల సిబ్బంది వెళ్లి ఓటింగ్ కు అవకాశం ఇస్తారని జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలను ఆదుకున్న జగన్ : బడ్డుకొండ

ప్రజాశక్తి-భోగాపురం

జగన్మోహన్ రెడ్డి పేదలకు అన్ని విధాలా ఆదుకున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముంజేరులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ పూడి నూకరాజు, మాజీ ఎంపిటిసి పి. రాంబాబు, కందుల రఘుబాబు, ఉప్పాడ శివారెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, యర్రప్పల నారాయణ, పడాల శ్రీనివాసరావు, భాను, సుందర హరీష్, సీరపు గురునాథ్‌రెడ్డి, ఎ.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచితాల మంత్రం.. రాజకీయ తంత్రం

ప్రజాశక్తి- విజయనగరం

గతంలో ఎన్నికలు వస్తున్నాయంటే రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలతో తమ పిల్లలకు ఉద్యోగావకాశాలొస్తాయని, ఉపాధి దొరుకుతుందని, ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తారని ఆశతో ప్రజలు ఎదురు చూసేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు ఉచితాల మూటను భుజాన ఎత్తుకుని ప్రచారంలోకి దిగాయి. ఇటు టిడిపి గానీ, అటు వైసిపి గానీ ప్రజలకు ఇస్తున్న హామీల్లో ఉచితాలు తప్ప ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రకటించలేదు. ఇదే సందర్భంలో ఇండియా వేదిక మద్దతుతో పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులు మాత్రం తాము ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలను వివరిస్తూ తమను గెలిపిస్తే హక్కులను, చట్టాలను రక్షించుకోవడంతో పాటు అనేక సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ, పార్లమెంట్‌లో గళమెత్తుతామని ప్రకటిస్తున్నారు.

ఇటీవల టిడిపి-జనసేన కూటమి, వైసిపి ప్రకటించిన మేనిఫెస్టోలో వప్పు బెల్లం పంచినట్లు ఉచిత పథకాలను ఊదరగొట్టారే తప్ప ప్రజాసమస్యల ఊసే లేదు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏవేవి ఉచితంగా ఇస్తామో చెప్పారు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గాని, ప్రాజెక్టులు గురించి గాని, ప్రజాపై పడుతున్న భారాలను తొలగిస్తామని గాని, పన్నులు పెంచబోమని గాని ప్రకటించలేదు. దీన్ని బట్టి పేద, మధ్య తరగతి ప్రజల పట్ల ఆ పార్టీల వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. డిఎస్‌సిపై తొలిసంతకం పెడతామని టిడిపి ప్రకటించడం మినహా మిగతా పోస్టుల ఊసే లేదు. అధికారంలోకి వస్తే ఎంత డబ్బు పంచుతామో చెబుతున్నారే తప్ప తాము అధికారంలోకి వస్తే పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తాం, ప్రాజెక్టులు నిర్మించి రైతుకు సకాలంలో సాగునీరందిస్తాం, పిల్లలకు మంచి విద్యను అందిస్తాం, ఆస్పత్రిల్లో మెరుగైన వైద్యం అందిస్తామన్న హామీలను ఇవ్వలేదు. దీంతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, వారు కొమ్ముకాస్తున్న బిజెపి నాయకులపై ప్రజలకు ఆశలు సడలిపోతున్నాయి.

ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఇటు టిడిపి, అటు వైసిపి రెండు పార్టీలూ తీవ్రమైన అన్యాయం చేశాయి. గత ఐదేళ్లలో వైసిపి, అంతకుముందు టిడిపి జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. తోటపల్లి, తారకరామతీర్థ సాగర్, మెంటాడ మండలంలోని గుర్ల గెడ్డ వంటి ప్రాజెక్టులు, ఏజెన్సీలోని గుమ్మిడిగెడ్డ, వట్టిగెడ్డ ఇలా అనేక ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. దశాబ్దాకాలంలో టిడిపి, వైసిపి అధికారం చేపట్టినా ఎవరూ ప్రాజెక్టులను పట్టించుకోలేదు. దీంతో రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడి పోవడం, పనిచేస్తున్న పరిశ్రమల్లో సామర్థ్యం లేకపోవడంతో కార్మికులు వలస బాట పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామన్న వైసిపి నాయకుల మాటలు కార్యరూపం దాల్చలేదు. భీమసింగి షుగర్ ఫ్యాక్టరీని కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మూతపడి పోయింది. దీంతో ఆ ప్రాంతంలో చెరుకు సాగు తగ్గిపోయింది. ఉన్న పరిశ్రమలను తెరిపించలేని పార్టీలు కొత్త పరిశ్రమలను ఏం తీసుకొస్తాయని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

దీనికి తోడు జిల్లాకు రావాల్సిన విభజన హామీలను రాబట్టడంలోనూ రెండు పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయి. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం ఇస్తామన్న నిధులను తెచ్చుకోవడంలో చతికిలబడ్డారు. గిరిజన విశ్వ విద్యాలయం, రైల్వే జోన్ వంటి అంశాలను సాధించుకోలేకపోయారు. వీటిపై టిడిపి, వైసిపి నాయకులు మాట్లాడకుండా తాము అధికారంలోకి వస్తే అమ్మఒడిస్తాం, గ్యాస్ ఉచితంగా ఇస్తాం, మహిళలకు డబ్బులు పంచుతామనే ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారు. ఎన్నికలు సమీపించడంతో ఇప్పటికే జిల్లాలో రాజకీయం వేడెక్కింది. వైసిపి, టిడిపి అధినేతలు ఒకటికి రెండుసార్లు ప్రచారంలో భాగంగా జిల్లాను చుట్టేశారు. అయితే వీరి ఉపన్యాసాల్లో ఎక్కడా ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, పరిశ్రమలు తీసుకొస్తామని గాని చెప్పకుండా కేవలం ఉచితాల మంత్రంతోనే రాజకీయాలను రంజింప చేస్తున్నారు. ఏ సభలో కూడా చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు ఊసెత్తడం లేదు. సభ ప్రారంభం నుంచి చివరి వరకూ ప్రత్యర్థి చేసిన మోసాలనే చెబుతూ చివరలో ఉచితాల వర్షం కురిపించి సభను రక్తికట్టించి ముగించేస్తున్నారు. దీంతో నాయకుల మాటల్లో ప్రజలకు భరోసా కల్పించడం లేదు. ఎవరు వచ్చినా ఏమీ చేయరన్న అంచనాకు ప్రజలు వచ్చేసినట్లు చర్చ జరుగుతోంది.

బాబామెట్టలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-విజయనగరం కోట

అభివృద్ధి సంక్షేమం సమానంగా చేస్తామని విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం 4,5 డివిజన్లలో బాబామెట్ట, గాంధీ పార్క్ ఏరియాలోనూ, మండలంలోని పినవేమలి, రాకోడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రచారంలో చేశారు. రౌడీరాజ్యం పోయి శాంతిభద్రతలు బాగుండాలంటే టిడిపిని గెలించాల న్నారు. అన్ని అనుమతులతో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేస్తే ఈ వైసిపి ప్రభుత్వం విజయనగరం నుంచి తరలించేశారని తెలిపారు. 13న జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్, గాడు అప్పారావు తెలుగుదేశం,జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి భారీ చేరికలు

46వ డివిజన్‌లో వైసిపికి చెందిన దొంతల గణేష్, మజ్జి జగన్, బొత్స పైడిరాజు, చందక చిన్నం నాయుడుతో పాటు 300 కుటుంబాలు , 47వ డివిజన్ వైసిపికి చెందిన మల్లివరపు మురళీ, మద్దిల రాజేష్, బవిరి మహేష్, అక్కివరపు బంగారురాజుతో పాటు వంద కుటుంబాలు, గాజులరేగకు చెందిన వైసిపి నాయకులు ఏనుగుల సత్యనారాయణ (సత్తిబాబు), సైలాడ అప్పలనాయడు, ధవళ ఎల్లారావు తదితర కుటుంబాలు శనివారం టిడిపిలో చేరాయి. వీరిని పార్టీలోకి టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆహ్వానించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. దీనికోసం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఓటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె ముందుగా శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏర్పాట్లపై ఆర్ఒ మురళీకృష్ణను ఆరా తీశారు. పోస్టల్ ఓటింగ్ కోసం పక్కగా ఏర్పాట్లు చేయాలని, వేగంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం విజయనగరం జెఎన్‌టియు గురజాడ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ సెంటర్లను సందర్శించారు. హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి, ఓటు వేయడానికి వచ్చే

అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు

ఉద్యోగులకు అవసరమైన సమాచారాన్ని, సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. ప్రతీ చోటా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక సదుపాయాలు ఉండాలని సూచించారు. ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎక్కడా ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి ఉండకుండా, వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వేచి ఉండటానికి సరిపడా షామియానాను, కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. విజయనగరం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, ఎఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ఇవిఎంలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట/విజయనగరం కోట

రానున్న ఎన్నికల్లో ఉపయోగించేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో ఇవిఎంలు సిద్ధమవుతున్నాయి. ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పటిష్టమైన భద్రత మధ్య ఈ ప్రక్రియ జోరుగా జరుగుతోంది. ఇవిఎంలను సిద్ధం చేయడంతోపాటు, వాటిలో గుర్తులను లోడ్ చేసే ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజయనగరం పోలీసు శిక్షణా కళాశాలలను సందర్శించారు. ఈ రెండు చోట్ల ఇవిఎంలను సిద్ధం చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. గడువులోపల ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్‌ఒలను ఆదేశించారు. విజయనగరంలో జాయింట్ కలెక్టర్, విజయనగరం రిటర్నింగ్ అధికారి కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఎస్.కోటలో ఆర్‌ఒ మురళీకృష్ణ, ఎఆర్‌ఒలు, డిటిలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

జెఎన్‌టియులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి